క్లుప్తంగా

శాకాంబరిగా రాజరాజేశ్వరిదేవి



అమ్మవారికి కూరగాయలతో అలంకరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం అగస్త్యేశ్వర స్వామి, రాజరాజేశ్వరి అమ్మవారికి తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అగస్త్యేశ్వరస్వామికి రుద్రాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. రాజరాజేశ్వరి అమ్మవారికి విశేషంగా పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేశారు. టమాట, నిమ్మకాయలు, బీరకాయ, క్యారెట్, వంకాయ, ఆకుకూరలు తదితర వాటితో శాకాంబరిదేవిగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలోని కాలక్షేప మండపంలో పావని బృందం ఆధ్వర్యంలో భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

దళితులకు రక్షణ కల్పించాలి



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న రాష్ట్ర మాలమహానాడు నాయకులు

ప్రొద్దుటూరు : దళితులపై జరుగుతున్న దాడులకు రాష్ట్ర మాల మహానాడు(రామాజీ వర్గం) ఆధ్వర్యంలో బుధవారం రాత్రి స్థానిక పాతబస్టాండ్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాలమహానాడు గౌరవాధ్యక్షుడు మురళీప్రసాద్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూసల ఓబన్న మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. దళితులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాలమహానాడు రాయలసీమ ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్, రాష్ట్ర సమన్వయకర్త యేసురత్నం, జిల్లా అధ్యక్షుడు ఉల్లి కిరణ్‌కుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల ఓబులేసు, జిల్లా యువజన కార్యదర్శి సీకే కుమార్, సహాయ కార్యదర్శి ఆకుమల్లా ప్రణయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్సీ అమలులో జాప్యం జరిగే అవకాశం ఉందని, వెంటనే మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. 11వ పీఆర్సీలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు తీవ్రంగా నష్టపోయారని, కొత్త ప్రభుత్వం ఏర్పడి నెల రోజులైనా ఈ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయలేదన్నారు. 12వ పీఆర్సీని మెరుగైన ఫిట్‌మెంట్‌తో ప్రకటించాలన్నారు. 11వ పీఆర్సీ బకాయిలను, కరువు భత్యం, సరండర్ లీవు, ఏపీజీఎల్ఐ బకాయిలను చెల్లించాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, జీపీఎస్ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. బోధనకు ఆటంకం కలిగించే అనవసర యాప్‌లను రద్దు చేసి, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ కృష్ణారెడ్డి, మునివర్ధన్ కుమార్, ఈశ్వర్‌రెడ్డి, జయరామిరెడ్డి, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



రాజుపాళెం మండలం టంగుటూరులో మిద్దెల పైకి ఎక్కి తిలకిస్తున్న గ్రామస్తులు



టంగుటూరులో ఊరేగింపులో రంగులు చల్లుకుంటున్న యువకులు



కాశినాయన మండలం అంబవరంలో పీర్ల ఊరేగింపు



పోరుమామిళ్లలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



పోరుమామిళ్లలో మొహర్రం వేడుకల్లో విశ్వనాథరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : హిందూ, ముస్లింలు కలిసికట్టుగా జరుపుకునే మొహర్రం పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఇది పేరుకు ముస్లింల పండుగ అయినా హిందువులు కూడా సంక్రాంతి, ఉగాది, దసరాతో సమానంగా జరుపుకొంటారు. ఈ నేపథ్యంలో మొహర్రం వేడుకలను ఏడాది బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొలువుదీరిన పీర్లకు ప్రత్యేక పూజలు చేశారు. సుందరాచార్యుల వీధిలోని పీర్లచావిడిలో పీర్లను పూలతో అలంకరించారు. నడింపల్లిలోని పీర్ల చావిడిలోని పీర్లను పురవీధుల్లో డప్పు వాయిద్యాల మధ్య ఊరేగించారు. కులమతాలకు అతీతంగా హిందూ, ముస్లిం, క్రైస్తవులు దర్శించుకుని చక్కెర, బూందీలను చదివింపులు చేశారు.

మతసామరస్యానికి ప్రతీక

పోరుమామిళ్ల (అట్లూరు) : మత సామరస్యానికి ప్రతీక మొహర్రం పండుగ అని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. పోరుమామిళ్ళ పట్టణంలోని మొహర్రం వేడుకల్లో ఆయన పాల్గొని, మాట్లాడారు. త్యాగాలకు ప్రతీక అయిన మొహర్రంను మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ బలిదానానికి గుర్తుగా నిర్వహించుకుంటారని తెలిపారు. ఈ మొహర్రంను ఇస్లాం క్యాలెండర్ ప్రకారం తొలి మాసంగా కూడా పిలుస్తారని అన్నారు. మతసామరస్యానికి, సమైక్యతకు ప్రతిరూపంగా నిలిచే ఈ మొహర్రంను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు.

■ పట్టణంలోని పీర్లచావిడిలో బద్వేలు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆయనకు ముస్లిం మత పెద్దలు, మైనార్టీ నాయకులు అల్లా, హబీబ్‌బాషు, కరీముల్లా, ఇస్మాయిన్, నాయబ్‌లు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నాయుడు, బూతప్ప, కొండారెడ్డి, మండల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

■ పోరుమామిళ్ళలో పీర్ల చావిడి నుంచి వీధుల వెంట పీర్ల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించడంతో పట్టణ వాసులే కాక నియోజకవర్గ నలుమూలల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. పోరుమామిళ్ల సీఐ చిరంజీవి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు గ్రామంలో బాబాఫకృద్దీన్ స్వామి పీరును తప్పెట్లు, మేళతాళాల మధ్య రంగులు చల్లుకుంటూ ఊరేగించారు. స్వామి తమ ఇంటి వద్దకు రాగానే గ్రామస్తులు నీళ్లు పోసి టెంకాయలు కొట్టారు. అలాగే గాదెగూడూరు, అర్కటవేముల గ్రామాల్లో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కాశినాయన : మండల పరిధి అంబవరం గ్రామంలోని పీర్ల ఊరేగింపులో.. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు బొరుగులు చల్లి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు వివిధ రకాల వేషధారణ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. వరికుంట్ల, బాలాయపల్లె, గంగనపల్లె, నరసాపురం గ్రామాల్లో గురువారం చిన్నసరిగెత్తు నిర్వహించనున్నారు.

బ్రహ్మంగారిమఠం : మండలంలోని గుండాపురం, సోమిరెడ్డిపల్లె, పలుగురాళ్ళపల్లె, తదితర గ్రామాల్లో పీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు.

వైభవంగా సత్యనారాయణస్వామి వ్రతం



సత్యనారాయణస్వామి వ్రతం చేస్తున్న అర్చకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీరాములపేటలోని రుక్మిణిపాండు రంగస్వామి ఆలయంలో బుధవారం తొలిఏకాదశి సందర్భంగా సత్యనారాయణస్వామి చిత్రపటానికి పూజలు చేశారు. కలశంలోకి స్వామిని ఆవాహన చేసి భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం ఆచరించారు. అర్చకులు సత్యనారాయణ స్వామి వ్రత మహత్యాన్ని, వ్రతం చేయడం వల్ల కలిగే శుభాలను వివరించారు. అనంతరం రుక్మిణి, శ్రీకృష్ణ ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ఆలయప్రాంగణంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి కాయాకర్పూరాలను నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం ఆలయంలో సామూహికంగా విష్ణుసహస్రనామ పారాయణం చేశారు. అలాగే మైదుకూరు రోడ్డులోని పాండురంగ స్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. పట్టణంలోని పలు వైష్ణవాలయాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లైటుపాళెం వీధిలోని శ్రీ కైవల్య సత్సంగ్ ఎంవీఎస్ ధ్యానమందిరంలో కైవల్య తీర్థస్వామి స్తోత్రరత్నావళి అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

వంట ఏజెన్సీ కోసం స్కూలు పరువు తీయకండి

- చేతనైతే అభివృద్ధి చేసి ఊరికి మంచి పేరు తీసుకురండి
- మాజీ ఉప సర్పంచ్ గోపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

ఖాజీపేట : ఒక వంట ఏజెన్సీ కోసం విద్యార్థులు తినే అన్నంలో వెంట్రుకలు, బొద్దింకలు వస్తున్నాయని కొందరు టీడీపీ నాయకులు హైస్కూల్ పరువు తీస్తున్నారని, ఇది తగదని కొత్తపేట మాజీ ఉపసర్పంచ్ గోపాల్‌రెడ్డి అన్నారు. కొత్తపేట గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో వంట ఏజెన్సీ కావాలంటే అధికారం మీ చేతిలోనే ఉంది తొలగించవచ్చు, అందులో ఎవ్వరికీ ఎలాంటి అభ్యంతరం లేదని అన్నారు. ఏజెన్సీ తొలగించడం కోసం విద్యార్థులు తినే అన్నంలో బొద్దింకలు, వెంట్రుకలు వస్తున్నాయని అసత్య ప్రచారాలు చేసి స్కూల్‌తోపాటు ఊరి పరువు తీస్తున్నారని అన్నారు. 18 ఏళ్లుగా వంట ఏజెన్సీని ఇప్పుడు ఉన్న వారు నిర్వహిస్తున్నారని అన్నారు. గత టీడీపీ పాలనలో కూడా ఇప్పుడు ఉన్న వారే నిర్వహించారని అన్నారు. అప్పుడు లేని సమస్య ఇప్పుడు ఎందుకు వస్తుందని అన్నారు. దీని కారణంగా విద్యార్థులు భయపడి పాఠశాలకు కొందరు రావడం లేదని అన్నారు. మధ్యాహ్న భోజనం తినడం లేదని అన్నారు. దీని వల్ల స్కూల్‌కు మంచి జరుగుతుందా లేక చెడు జరుగుతుందా అని అన్నారు. గత 10 రోజుల నుంచి వంట ఏజెన్సీ తొలగించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. తొలగించేందుకు కారణాలు లేక పోవడంతో ఇలా తప్పుడు కారణాలు చూపించి, మండలంలోని స్కూల్స్‌లోని విద్యార్థులను భయాందోళనకు గురి చేయడం సరికాదని అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు కొత్త సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌తోపాటు చాలా పనులు గ్రామ అభివృద్ధి కోసం చేశామని అన్నారు. చేతనైతే మీరు కూడా గ్రామ అభివృద్ధిని మా కంటే ఎక్కువ చేసి చూపించాలని, ఇలా గ్రామం పరువు తీసే చర్యలకు పాల్పడ వద్దని హితవు పలికారు.

కుష్టు వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి



ప్రొద్దుటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించడంలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా కామనూరు పీహెచ్‌సీలో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆశా, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటి సర్వే ద్వారా కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలని డాక్టర్ తెలిపారు. అనంతరం యానాది కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లెప్రసీ నోడల్ పర్సన్ బీపీ వరప్రసాద్, ఫార్మాసిస్టు శ్రీధర్, లక్ష్మణస్వామి, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్, అరుంధతి, ఆశా కార్యకర్తలు ప్రభావతి, రామక్క, జ్యోత్స్న, ప్రసన్న, సాలమ్మ పాల్గొన్నారు.

బి.కోడూరు : కుష్టు వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్‌లు పేర్కొన్నారు. పీహెచ్‌సీలో జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన సర్వేపై ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీహెచ్‌ఓ నాగమణి, పీహెచ్ఎన్ పుష్పాంజలి, హెల్త్ సూపర్‌వైజర్ జాన్‌విలియం, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం పాల్గొన్నారు.

ఘనంగా తొలిఏకాదశి



బ్రహ్మంగారిమఠం : వీరబ్రహ్మేంద్రస్వామి సన్నిధిలో ఏకాక భజనలు చేస్తున్న భక్తులు



ప్రొద్దుటూరు : ప్రత్యేక అలంకరణలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



ప్రొద్దుటూరు : భక్తులకు భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

బద్వేలు (వ్యవసాయం) : తొలి ఏకాదశి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. వేకువ జామునే ఇంటి ముందు కల్లాపు చల్లి అందమైన ముగ్గులు వేశారు. ఇంట్లో పూజా కార్యక్రమాలు ముగించుకొని దేవాలయాలకు వెళ్లి స్వామి వారికి కాయాకర్పూరం సమర్పించుకున్నారు. తొలి ఏకాదశితో హిందువుల పండుగలు ప్రారంభమవుతాయి. ప్రకృతి, తొలకరి వానలతో వ్యవసాయం, సామాజిక అంశాలు ఈ పండుగతో ముడిపడి ఉండడంతో అధిక ప్రాధాన్యం ఇస్తారు. అందుకే ఈ పండుగ రోజున రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుడతారు. పంచాంగం అనుసరించి ఏడాదిలో 24 ఏకాదశి రోజులు ఉంటాయి. కానీ ఆషాఢ మాసం శుక్ల పక్షం రోజున వచ్చే ఏకాదశిని తొలి ఏకాదశి అంటారు. తొలి ఏకాదశి రోజు నుంచి విష్ణుమూర్తి పాలకడలిలో యోగనిద్రలోకి వెళతారని, అందువల్లనే దీనికి శయన ఏకాదశి అనే పేరు కూడా ఉంది.

వీరబ్రహ్మేంద్రస్వామి సన్నిధిలో..

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి సన్నిధిలో ఏకాక భజనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన భజన మండలి సభ్యులు పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులకు దేవస్థానం నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు : స్థానిక కేవీఆర్ కాలనీలోని శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

■ స్థానిక కూరగాయల మార్కెట్ సమీపంలోని పెద్దమ్మ ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్, ఏపీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సుధాకర్ మాదిగ, కుటుంబ సభ్యులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన : జ్యోతిక్షేత్రంలోని కాశినాయన ఆలయంలో వారం రోజుల నుంచి ఏకాంబర భజన నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి కాశినాయన విగ్రహాన్ని మంగళ, డప్పువాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కాశినాయన సమాధిని దర్శించుకున్నారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

రాజుపాళెం : వెల్లాల పుణ్యక్షేత్రంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అర్కటవేముల గ్రామంలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి, టంగుటూరు గ్రామంలోని రుక్మిణి, సత్యభామ సమేత మదన గోపాలస్వామి, లక్ష్మీదేవి, ఆంజనేయస్వాములకు అర్చకులు విజయవర్ధన్ రావు పాలాభిషేకం, విశేష పూజలు చేశారు.

గుజరాత్ లాంటి చట్టాలు రావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : గుజరాత్ రాష్ట్రంలో భూమి ఆక్రమణదారుడు అది తన భూమి అని కోర్టులో రుజువు చేసుకోవాలని, అలాంటి చట్టమే ఏపీలో రావాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ దుర్మార్గమైన చట్టమన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ చట్టం రద్దు చేసినందుకు చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రొద్దుటూరులో ఇసుక రీచ్ పెట్టాలని కలెక్టర్‌ను అడుగుతామని పేర్కొన్నారు.

21న బండలాగుడు పోటీలు

వేముల : మండలంలోని భూమయ్యగారిపల్లెలో ఈనెల 21న గురుపౌర్ణమి సందర్భంగా రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వృషభాలకు రూ.లక్ష నుంచి రూ.10 వేల వరకు బహుమతులు ఇవ్వనున్నారు. పోటీలలో పాల్గొంటున్న వృషభాలకు ప్రోత్సాహక బహుమతులు ఇస్తారు.

డీఈఓ పూల్ భాషోపాధ్యాయుల ఉన్నతీకరణకు కృషి



మాట్లాడుతున్న రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : డీఈఓ పూల్ భాషోపాధ్యాయులను ఉన్నతీకరించడానికి కృషి చేస్తామని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, అధ్యక్షుడు అంకాల్ కొండయ్యలను డీఈఓ పూల్‌లోని ఉర్దూ పండితులు కలిశారు. తాము నాలుగేళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలను వారు వివరించారు. ఈ సందర్భంగా ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ కృషి వల్ల కొన్ని జిల్లాల్లో పూర్తిగా భాషోపాధ్యాయుల ఉన్నతీకరించబడినారన్నారు. మిగిలిన రెండు, మూడు జిల్లాల్లో ఉన్న తెలుగు, హిందీ, ఉర్దూ పండితులు వారి కేడర్ పోస్టు రద్దు కావడంతో గత నాలుగేళ్లుగా సరైన ఖాళీలు కేటాయించలేదన్నారు. ప్రతి బదిలీల్లోనూ బలవంతంగా మార్చుతూ ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వీరందరినీ ఉన్నతీకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర కోశాధికారి భోగా గంగాధర్, ఉపాధ్యక్షుడు సాయికుమార్, ఉర్దూ పండితులు రోషన్, ఖుర్దూస్, షేర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

భోజనశాల నిర్మాణానికి భూమిపూజ



భోజనశాల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

కలసపాడు : మండలంలోని ఎగువ రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం కర్ణాటక రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ రిటైర్డ్ సహాయ సంచాలకులు డాక్టర్ గొంగల్‌రెడ్డి కాశిరెడ్డి దాతృత్వంలో నిర్మించ తలపెట్టిన భోజనశాలకు బుధవారం భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. వృత్తిరీత్యా ఇతర రాష్ట్రాల్లో స్థిరపడినప్పటికీ తాను పుట్టిపెరిగిన ప్రాంతంలో పేద, మధ్యతరగతి ప్రజల పిల్లల విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందించాలనే సదుద్దేశంతో సుమారు రూ.10 లక్షల అంచనాతో భోజనశాల నిర్మాణం చేపట్టినట్లు దాత కాశిరెడ్డి తెలిపారు. రెండు నెలల్లో నిర్మాణం పూర్తి చేసి ఉపాధ్యాయుల దినోత్సవం రోజున భోజనశాలను ప్రారంభోత్సవం నిర్వహించదలచామన్నారు. ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి మాట్లాడుతూ కన్న తల్లిదండ్రులను కూడా కొంత మంది పట్టించుకోకుండా నడిరోడ్డు మీద పడవేసే ప్రస్తుత పరిస్థితుల్లో తాను పుట్టిన ఊరి అభివృద్ధికి ఇంత గొప్ప తోడ్పాటు అందిస్తున్న దాత కాశిరెడ్డి ఔదార్యం వెలకట్టలేనిదని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.కమాల్, సర్పంచ్ వెంకటయ్య, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రసూల్, దాత బంధువులు పల్లెఉమామహేశ్వరరెడ్డి, టీచర్ పల్లెరామక్రిష్ణారెడ్డి, గంగసాని వెంకటరెడ్డి, జి.వెంకటరెడ్డి, రేనాటిబ్రహ్మానందరెడ్డి, ఉపాధ్యాయులు కె.శ్రీనివాసులు, బ్రహ్మారెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ఆంజనేయకొట్టాలులో దెబ్బతిన్న స్తంభం



సుంకేశులలో మనిషికి అందే ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ వైర్లు



బుద్దాయపల్లెలో నేలకొరిగిన స్తంభం



ఆంజనేయకొట్టాలు సమీపంలో..



ఆంజనేయకొట్టాలు పరిధిలో విరిగి పడిపోయిన స్తంభం

ప్రస్తుతం వర్షాకాలం. రైతులు పొలంబాట పట్టారు. భూమిని దుక్కి చేస్తున్నారు. వరి సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. అయితే విద్యుత్ రూపంలో ప్రమాదం పొంచి ఉంది. ఖాజీపేట మండలంలోని చాలా ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు విరిగి పడిపోయాయి. మరి కొన్ని చోట్ల వైర్లు చేతికి అందే ఎత్తులో ఉన్నాయి. ట్రాక్టర్‌ను తీసుకెళ్లాలంటేనే.. రైతులు భయపడుతున్నారు. పంటలు సాగు చేసిన తర్వాత.. కొత్త పోల్ వేసే అవకాశం ఉండదు. కావున విద్యుత్ శాఖ అధికారులు ఇప్పుడే స్పందించి.. సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. – ఖాజీపేట

రోడ్డు పక్కన కంప చెట్ల తొలగింపు



రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లను తొలగిస్తున్న జేసీబీ

చాపాడు : మండల పరిధిలోని అన్నవరం – మడూరు మధ్య గల ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంప చెట్లను తొలగించారు. ఈ నెల 12వ తేదీన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో కంప చెట్ల దుస్థితిపై స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకూ స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు అన్నవరం – మడూరు గ్రామాల మధ్య గల 5 కి.మీ మేరకు కంపచెట్లను తొలగించారు. మంగళవారం, బుధవారాల్లో అన్నవరం నుంచి మడూరు పంచాయతీ చిన్నవరదాయపల్లె క్రాస్ రోడ్డు వరకూ కంప చెట్లను జేసీబీల చేత తొలగించటం జరిగిందని ఆర్‌అండ్‌బీ ఏఈ దాదాబాషా తెలిపారు. కంపచెట్ల తొలగింపు పనులకు గ్రామ సచివాలయ సిబ్బంది పర్యవేక్షించారు.